

'నమస్తే తెలంగాణ, ముల్కనూరు సాహితీపీఠం' సంయుక్తంగా నిర్వహించిన 'కథల పోటీ-2023/24'లో రూ.5 వేల బహుమతి పొందిన కథ.

''ఊరుకో తల్లీ! ఇలా ఎంతసేపు ఏడుస్తావు? ఇందులో నీ తప్పు ఏమీ లేదు. బాధ పడకు'' కోడల్ని ఎలా ఊరడించాలో అర్థం కావడం లేదు రాజేశ్వరికి.

''నా మనసు రగిలిపోతోంది అత్తయ్యా! ఇటువంటి దుర్మార్గులను ఊరికే వదిలి పెట్టకూడదు''.

''అవుననుకో.. జరిగిందేదో జరిగిపోయింది. ఇప్పుడు మనం ఏమీ చేయలేం. మనసు కుదుట పరచుకుని భోజనం చేసి పడుకో!''.. కోడలి భుజం తట్టి తన గదిలోకి వెళ్లిపోయింది రాజేశ్వరి.

* * *

మర్నాడు కొడుకు, కోడలు ఏదో గొడవ పడుతూ ఉంటే.. పూజ గదిలో నుంచి ఇవతలకు వచ్చింది రాజేశ్వరి.

''సాయంత్రం మాల్‌కి వెళ్లాల్సిందే!'' అంటోంది శ్రుతి.

''ఎందుకు తీరుకూర్చుని గొడవ పెద్దది చేసుకోవడం. నలుగురూ నాలుగు మాటలు అనుకుంటారు. అవసరమా? అంతా ఒక పీడ కలగా భావించి మరచిపో!'' అంటున్నాడు సాగర్.

''అనుభవించిన వాళ్లకే తెలుస్తుంది బాధ. నేను వాణ్ని వదలను. ఆ దుర్మార్గుడికి శిక్ష పడాల్సిందే!''.

తల్లిని చూస్తూనే..

''చూడమ్మా! నీ కోడలు ఎంత చెప్పినా వినడం లేదు. సాయంత్రం మళ్లీ మాల్‌కి వెళ్లి, నిన్నటి సీసీటీవీ ఫుటేజ్ చూసి.. వాణ్ని ఐడెంటిఫై చేసి, వాడి మీద పోలీస్ రిపోర్ట్ ఇవ్వాలట! ఎందుకు చిన్న విషయం పెద్దది చేసుకుని నలుగురి నోట్లో నానడం అంటే వినడం లేదు!'' అన్నాడు సాగర్.. శృతి మీద ఫిర్యాదు చేస్తున్నట్లుగా.

''ఇది చిన్న విషయమా? దీనిని ఆడవాళ్లు ఎంత అవమానంగా భావిస్తారో మీకు అర్థం అవుతోందా? వాడికి శిక్ష పడితే మళ్లీ జీవితంలో ఇటువంటి పాడుపని చేయడు. అది చూసి అటువంటి పాడు ఆలోచనలు ఉన్న వాళ్లకీ బుద్ధి వస్తుంది'' ఆవేశంగా అంది శృతి.

''అయితే నా మాట విననంటావు. నీ మొండి పట్టుదల నీదే అన్నమాట! అమ్మా.. నువ్వయినా నీ కోడలికి అర్థమయ్యేలా చెప్పు. నాకు ఆఫీస్‌లో ఇన్‌స్పెక్షన్ ఉంది ఇవాళ'' బూట్లు వేసుకుని హడావుడిగా వెళ్లి పోయాడు సాగర్.

''అమ్మా.. వాడు అంతగా చెబుతున్నాడు కదా! ఇక్కడితో ఈ విషయం అందరం మరచిపోదాం. ఇక ఈ విషయంలో నువ్వు ముందుకు వెళ్లవద్దు'' నచ్చ చెబుతున్న ధోరణిలో అంది రాజేశ్వరి.

''లేదు అత్తయ్య గారు! వాడు చేసిన పాడుపనికి వాడు శిక్ష అనుభవించాల్సిందే!'' ఖచ్చితంగా చెప్పేసింది శృతి.

సాయంత్రం అయిదు అవగానే భర్తకు ఫోన్ చేసింది.

''ఏమిటో త్వరగా చెప్పు. చాలా బిజీగా ఉన్నాను'' అన్నాడు సాగర్ చిన్నగా మాట్లాడుతూ.

''గుర్తుంది కదా.. సాయంత్రం మాల్‌కి వెళ్లాలి. ఆరు అవకుండా వచ్చేయండి''.

''ఇంకా నువ్వు అదే విషయం పట్టుకుని కూర్చున్నావు. చెప్పాను కదా.. గొడవ పెద్దది చేసి, నలుగురి నోట్లో పడటం ఎందుకని?! మరోసారి ఆలోచించు!''.

''మరో ఆలోచనే లేదు. వాణ్ని పోలీసులకి పట్టించి జైలుకి పంపించాల్సిందే!''.

''అలాగే చేద్దాం. చెప్పానుగా ఈరోజు చాలా బిజీ. మరోరోజు చూద్దాం''.